తెలుగు శాస్త్రుల్లుగారు

౧

[శాస్త్రుల్లుగారిల్లు. నడవలో తాటాకు చాపమీద శాస్త్రుల్లుగారు కూర్చున్నారు. పక్కను ఆయన కుమారుడు పలక చేత్తో పట్టుకు కూర్చున్నాడు. ఇంట్లో శాస్త్రుల్లుగారి భార్య వంట చేస్తోంది]

కుమారుడు

నాన్నా, మరీ,..........

శాస్త్రుల్లుగారు

ఎన్నిమాఱులు నీకుం జెప్పవలయును. "నాన్నా" యన కూడదు. "నాయనా" యనవలయును. మఱియు "మరీ" యన రాదు. "మఱియు" ననవలయును. తెలిసినదా?

కుమారుడు

తెలిసింది, కాని, నాయనా, నాకు కా గుణింతం వచ్చేసింది. కావలిస్తే అప్పజెస్తా.

శాస్త్రుల్లుగారు

ఓరీ, నీవు మాట్లాడునదంతయు గ్రామ్యము. నీవటుల మాటలాడరాదని జెప్పితినిగదా! మాటి మాటికి నేల నా రీతి నుడివెదవు?

కుమారుడు

అవునుగాని నాన్నా—కాదు నాయనా—కా గుణింతం అప్పజెప్పుకోవూ?

శాస్త్రుల్లుగారు

ఎన్నండును గ్రామ్యంబు మాట్లాడవుగదా?

కుమారుడు

మాట్లాడను. కాని అమ్మతో నువ్వెందుకు, నే మాట్లాడినట్లే మాట్లాడతావూ? నువ్వుకూడా అల్లా మాట్లాడుతూంటే నేనూ అమ్మాకూడా మాట్లాడతాముగదా.

శాస్త్రుల్లుగారు

సరియే, నీవు సెప్పునది బాగై యొప్పెడిని. ఈ దినమున మీ యమ్మతోఁగూడ పరిశుద్ధ భాషనే మాటలాడెదను. కానిమ్ము, గుణితముం జెప్పుము.

కుమారుడు

విను నాన్నా చెప్పుతాను. కా, కాకుదీర్ఘమిస్తే కా; కాగ్గుడిస్తే కి; గుళ్లోదీర్ఘమిస్తే కీ; కాకొమ్మిస్తే కు; కొమనా దీర్ఘమిస్తే కూ.... ....

శాస్త్రుల్లుగారు

ఆఁ, ఆఁ, ఆగు మాగుము. ఆరీతిని జెప్పుచుంటి వేల?

కుమారుడు

మా మేష్టరల్లా చెప్పేరు నాన్నా

శాస్త్రుల్లుగారు

వలదు; ఎంతమాత్రంబు వలదు; అట్లు సెప్పరాదు.

కుమారుడు

ఎల్లా చెప్పా.... ....

శాస్త్రుల్లుగారు

ఛీ, సరిగా వచింపుము

కుమారుడు

ఎట్లు సెప్పవలయును దండ్రీ!

శాస్త్రుల్లుగారు

బాగు. ఆరీతిగా భాషించుట నేర్వవలయును. ఇచ్చ వచ్చిన

మచ్చున ముచ్చటించవచ్చునే. అఖండ పారావార మహా సాగరంబు భాతి భాషాయోషామతల్లి గంభీరంబుగ వెలుంగ వలదే. చెప్పవలసిన విధానంబియ్యది యాలింపుము పుత్రకా!

కుమారుడు

ఊం

శాస్త్రుల్లుగారు

క. కనకు దీర్ఘమిచ్చినం గా; కనకు గుడినిచ్చినం గి; గుడిలో దీర్ఘమిచ్చినం గీ; కనకు కొమ్మునిచ్చినం గు; కొమ్మునకు దీర్ఘం బిచ్చినం గూ. తెలిసినదా ?

కుమారుడు

అదేవిటి, గా గుణింతం చెబతావు? ఇది బాగుందికాదు నాన్నా! మాష్టారు చెప్పిందే బాగుంది.

శాస్త్రుల్లుగారు

అట్లనరాదు. నేను జెప్పిన విధంబుననే నేర్చుకొనుము.

కుమారుడు

అల్లా చేస్తే మాష్టారు కొడతారు నాన్నా.

శాస్త్రుల్లుగారు

మీ యొజ్జకుం దెనుంగురాదు. నే నింటియొద్ద నిక్కారణి బోధించితినని నొక్కి వక్కాణింపుము. కట్టా! ఇట్టిడులవల్లనే తెనుంగు తుదముట్ట నున్నయది.

కుమారుడు

చెప్పినా కొడతారునాన్నా, బళ్లో అందరూ చెప్పినట్లు చెప్పకపోతేనూ.

శాస్త్రుల్లుగారు

కొట్టిన బిమ్మట నాతోడం జెప్పుము. ప్రాథమిక పాఠ

శాలలందు దెనుంగుబాస నీసరణి కాసటబాసట సేయుచున్నారు. నే నొక్కరుండ నేమిసేయగల్గుదు ? పరిషత్తువారైన మా పండితుల మొరాలింపరే ? దొరతనమువారైన నొక శాసనము నిర్మింపరే ? ఏమిసేయుదు ? హా ! హతవిధీ !

కుమారుడు

నాన్నా, బళ్లో మాకు కొత్తకథ చెప్పేరు. ఇప్పుడు చెప్పనా అది ?

శాస్త్రుల్లుగారు

చెప్పుము.

కుమారుడు

అనగా అనగా ఒకరాజు. ఆరాజూ — అదేమిటి చెప్మా మరిచి పోయాను — ఏదో ఊరు నాన్నా, ఆవూరు పాలిస్తున్నాడుట. ఆరాజుకి ఇద్దరు కొడుకులుట. వాళ్లు ఏం చేశారా—

శాస్త్రుల్లుగారు

గ్రామ్యము గ్రామ్యము — ఉచ్చరించకు ముచ్చరించకుము.

కుమారుడు

గ్రామ్యము కాదునాన్నా వాళ్లు చేస్త — ఒకనాడు—

భార్య

[లోపలి నుంచి]

ఇదిగో, ఏమండోయి, ఊఁ ....

శాస్త్రుల్లుగారు

ఛీ ఛీ, కుంకా ! గ్రామ్యంబు మాటాడెద వెందుసకు ?

కుమారుడు

నేనా, నాన్నా!

శాస్త్రుల్లుగారు

అవును.

కుమారుడు

మాష్టారు చెప్పిన కథ చెప్పతున్నాను నాన్నా, విను మరి కొనసాకూను. వాళ్లు ఒకనాడు ఒక అడివిలోకి వేటకెళ్లి........

భార్య

[లోపలినుంచి]

వినపడ్డం లేదూ ? ఇదిగో, చూడండి, ఏమండోయి.

కుమారుడు

ఒక జింకపిల్లని పట్టుకొని

శాస్త్రుల్లుగారు

జింకపిల్లకాదు హరిణపోతంబు .... ఉండు, ఉండరా, మీ అమ్మ పిలుస్తూన్నట్లుంది. అవునే, ఒసేవు, పిలిచాహా ?

కుమారుడు

నాన్నా, నువ్వూ గ్రామ్యం మాట్లాడుతున్నావేమిటి ?

శాస్త్రుల్లుగారు

లేదు, లేదు మరచితిని.

భార్య

వంటయింది, మడి కట్టుకోవచ్చు.

శాస్త్రుల్లుగారు

వచ్చుచుంటిని, వడ్డింపుము. లెమ్ము బాలకా! భోజనంబు నకుం రమ్ము.

౨

[శాస్త్రుల్లుగారి వంటిల్లు. పెద్ద పీట మీద శాస్త్రుల్లుగారు కూచుని గంధాక్షత లుంచుకొంటున్నారు. ఆయన కుమారుడు ప్రక్కను చిన్న పీట మీద కూర్చున్నాడు. ఆయన భార్య వడ్డి స్తోంది. వడ్డన అయిన తరువాత తండ్రీ కొడుకూ భోజనానికి కూర్చున్నారు. అడ్డ గోడ దగ్గిర ఆయన భార్య నిలబడి చూస్తోంది.]

శాస్త్రుల్లుగారు

మరి కొంచెము సూపంబును వడ్డింపుము.

భార్య

[విననట్లు నిలుచుండును]

శాస్త్రుల్లుగారు

కించి తూ్సపంబుం గొని తెమ్ము,

భార్య

ఏమి టంటారూ! పప్పులో ఉప్పు సరిపోయిందా?

శాస్త్రుల్లుగారు

పప్పున లవణం బతిమాత్రముగ నున్నయది. అయినం గానిమ్ము. కొంచెము తెమ్ము.

భార్య

ఏమిటోనమ్మా మీ భాష నాకు తెలియదూ. కొంచెం పప్పు వడ్డించమంటారా ?

శాస్త్రుల్లుగారు

మనోగతభావంబు యథాక్రమంబుగ గ్రహించితివి మనోహారిణీ! సూపంబు గొని తెమ్ము.

కుమారుడు

నాకూ్కడా కొంచెము పప్పెయ్యవే అమ్మా.

శాస్త్రుల్లుగారు

డింభకా, గ్రామ్యంబు వచింతువే ?

కుమారుడు

లేదు నాన్నా, మరచిపోయాను.

శాస్త్రుల్లుగారు

ఘృతము, ఘృతము.

కుమారుడు

అమ్మా, నాన్నకి నెయ్యిట.

భార్య

ఈవేళ ఇదేమిటో ఈ వికారం వచ్చిపడింది. ఆడదాని దగ్గిరా పాండిత్యం అంతాను ?

శాస్త్రుల్లుగారు

మన పుత్రకుని కొఱకై యిట్లు భాషించుచుంటిని గ్రహింపజాలవా? కొంతకాల మి ట్లాచరించిన వాడు సలక్షణాంధ్రభాష నేర్వగలాడు.

భార్య

ఏమోనమ్మా నాకు తెలియదు——మీ చదువులూ మీ వేషాలూను. చచ్చి స్వర్గాన్నున్నారు మా॰ నాన్నగారు. ఆయన యిలాగ ఎప్పుడూ మా అమ్మను కాల్చుకుతినలేదు. ఆయనకి చదువులోటా ఏమిటి? దేశ దేశాలూ తిరిగి ఓహో అనిపించుకొన్నారు. ఇదేమిటో ఈ కొత్తవేషాలన్నీ ఈ కాలంలో వచ్చిపడ్డాయి.

శాస్త్రుల్లుగారు

ఆడుదానవు నీకేమి తెలియును. వండి వడ్డింప నేర్చినవా రాడువారు. ఇతర విషయంబులు వారికేల ?

భార్య

అవునుగాని సోమన్నగారి కూతురికి పెళ్లయిందిటనుమండీ.

శాస్త్రుల్లుగారు

కూతురునకుం బెండ్లయినదని ఎవ్వరుసెప్పిరి నీకు ప్రేమసీ.

భార్య

రేవు దగ్గిర నర్సమ్మ చెప్పింది. అందరూ గుంటూరెళ్లి పెళ్లి చేసుకు వచ్చారుట.

శాస్త్రుల్లుగారు

గుంటూరునకుం దర్లి వెళ్లిరా; అందేమి విశేషం బున్న యది ప్రాణప్రియా.

భార్య

ఊరుకోండి. ఎవరైనా వింటే నవ్విపోతా రనేనా లేదు కాబోలు.

శాస్త్రుల్లుగారు

ఏల నేల ?

భార్య

ఏమిటి మరీ! నాటకాల్లోలాగ నన్నలా పిలుస్తారేమిటి ? ప్రేయసిట, మన్నుటి, మశానంట—

కుమారుడు

అమ్మా, చారే.

శాస్త్రుల్లుగారు

ఈనాడు తింత్రిణీఫలరసంబుం గాచితివా లేదా ?

భార్య

చారు కాచాను. పొయ్యమన్నారా ఏమిటి ?

శాస్త్రుల్లుగారు

పోయుము.

భార్య

[నడ్డిమీద ఒకచెయ్యి పెట్టుకొని కొంచెము వంగి పోస్తూండగా ఆయన కాళ్లమీదికి చారు చింది౦ది]

కాళ్లమీదగానే పల్లేదుగదా?

శాస్త్రుల్లుగారు

నీకేమియు బుద్ధిలేనట్లున్న దే?

భార్య

నే నేంజేశాను?

శాస్త్రుల్లుగారు

ఏమిచేసితివా? కన్నులులేవా? నీకు నేత్రాంబుజంబులు శిరంబుపై కరుడెంచినవి.

భార్య

చాల్లెండి, నేర్చుకొన్నారెలాగయితే!

శాస్త్రుల్లుగారు

ఛీ, త్వాష్ట్రం...., ఇంకా కారుకూతలు కూస్తావు.

భార్య

బాగుంది, నే నేమన్నానూ? ఈవేళ లేచినవేళ మంచిది కాదు. ఎవరి మొహం చూశానోకాని, కాస్త చారు చిందితే ఇంతకోపం—

శాస్త్రుల్లుగారు

కోపం కోపం అంటావు. చూడు ఏంజేస్తానో? బొత్తిగా అదుపాజ్ఞలు లేకుండా సంచరిస్తున్నావు. ఈవేళ నేనయింది, శ్రేష్ఠుడ్దున్న ఎవరేనా పెద్దమనిషి వచ్చాడనుకో, ఇల్లా చేసే దానివేనా?

కుమారుడు

నాన్నా, గ్రామ్యం మాట్లాడుతున్నావేం?

శాస్త్రుల్లుగారు

ఛా, కుఁక్రకుంకా, నోరుముయ్. బోడ్ముండని నిర్భాగ్యుడవు నువ్వా నాకు చెప్పడమే ?

భార్య

[ఏడుస్తూ]

కుఁక్రదాన్ననుకొన్నారా, గుంటదాన్ననుకొన్నారా, నన్నలా తిడతారు ? ఇంతకీ నే నేంజేశానని ? అక్కడికీ నే నెంతో భయ భక్తులతో చేస్తూంటే — నాకు మాట దక్కేవిధం లేందే. ఇంతకీ నేను నోచిన నోములు ఇల్లా ఉన్నాయి. మా నాన్న ముండాకొడుకు యిల్లాచేశాడు. నేనూ—

శాస్త్రుల్లుగారు

నోరు మూస్తావా, ముయ్యవా ? వాగుడు మహాఁ ఎక్కు వవుతోంది.

భార్య

వాగుడికి నే నేమేనా శాస్త్రాలు చదివేనా ? భాషలు నేర్చేనా ? చదువులు చట్టుబండలూ కూడాను నాబతుక్కి. ఇక్కడికే ఉండ రాఁవులు లేకుండా ఉన్నాయి. చీకటుండగా లేచి, లేచింది మొదలు కొని వంచిననడుం ఎత్తకుండా అరవ చాకిరీ అంతా చేస్తున్నానని మెప్పా మెహర్భాణీఆ? ఎంత చేసినా నా చివాట్లు నాకు తప్పవు.

శాస్త్రుల్లుగారు

ఒళ్లూ పయీ తెలిసి సంచరిస్తే నిన్నేమీ ఎవళ్ళూ అనరు.

భార్య

ఎవళ్లూ ఎందు కనాలి నన్నూ ? నే నేమన్నా ఒక దొంగ తనం చేశాననా ఒక కానిపని చేశాననా ? ఒకళ్ల జోలీ శొంఠీ

లేకుండా నన్ను ముట్టుకోకు నామాలికాకని నా ఖర్మాన్ని నేను బతుకుతూంటే నామీదపడి ఏడిసేవాళ్లే ప్రతివాళ్లూను.

శాస్త్రుల్లుగారు

అంతకంతకి సుతి మించుతోందే?

భార్య

ఏమిటా అదమాయింపు అస్తమానమూను? అవును నాదే తప్పు. మొదటినుంచీ నాతో వేళాకోళం చెయ్యడ మెందుకు మీరు?

శాస్త్రుల్లుగారు

నే నేం వేళాకోళము చేశాను?

భార్య

ఆ దిక్కుమాలిన భాషతో నాతో మాట్లాడ్డం ఎందుకూ?

శాస్త్రుల్లుగారు

నీకు తెలియకపోతే నేర్చుకోవాలి. భాషను తిడతా వెందుకు?

భార్య

ఇఖ అదొకటి తరవాయి—ఈ సౌడభ్యానికి సాయం.

శాస్త్రుల్లుగారు

ఊఁ. మజ్జిగ పోయుము.

భార్య

ఏమో నాకు తెలియదు. మీరే పోసుకోండి. ఆపీటదగ్గిరే పెట్టాను. మొదట నన్ననడమూను, తరవాత సర్దుకోవడ మూను. ఎప్పుడూ ఉన్నదే!

శాస్త్రుల్లుగారు

స్త్రీలు మృగప్రాయులుగదా!
నీకును గావలయునా మజ్జిగ డింభకా!

కుమారుడు

కావలయును తండ్రీ!

శాస్త్రుల్లుగారు

కొనుము పుత్రకా.

3

[బడి పిల్లలంతా బల్లల మీద కూర్చుని వ్యాసాలు వ్రాస్తున్నారు. తెలుగు శాస్త్రుల్లుగారు కుర్చీ మీద కూర్చుని కునికి పాట్లు పడుతున్నారు. ఒక అరగంట అయిన తరువాత శాస్త్రుల్లుగారు కళ్లు తెరిచి చూచి, కళ్లు నులుముకొని, కుర్చీలో ఠీవిగా కూర్చుని]

శాస్త్రుల్లుగారు

రాశార్రా అందరూ వ్యాసాలూ?

పిల్లలు

రాశామండీ

శాస్త్రుల్లుగారు

అవధాన్లుగారబ్బాయీ, యిలారా; నీవు వ్రాసింది చూపించు.

అబ్బాయి

చదవనాండి?

శాస్త్రుల్లుగారు

చదువు. నేను కునికిపాట్లు పడుతూంటే హెడ్మాష్టరుగానే చూడలేదుగదా?

అబ్బాయి

లేదండి. వస్తే మేము చెప్పమూ.

శాస్త్రుల్లుగారు

ఊఁ. సరే, చదువు.

అబ్బాయి

"ఒక వూరిలో ఒకపిల్లవాడు వుండెను. అతనికి చిన్నప్పుడే తల్లీ తండ్రీ కాలముచేసిరి. మేనమామగారి యింటివద్ద

చదువుకుంటూ ఉండేవాడు. తిరిగే కాలూ తిట్టేనోరూ ఊరు కొనదన్నట్లుగా ఇతడు బళ్లోకి వెళ్లడం మాని తోటలవెంబడి తిరిగేవాడు. పొద్దెక్కడంతోనే యింటికివచ్చి కూడా తెచ్చిన పువ్వులన్నీ దండలకింద గుచ్చేవాడు"—

శాస్త్రుల్లుగారు

ఆగు, ఆగు. ఏమిట్రా అబ్బాయీ, నువ్వుకూడా యిలా తగలబెట్టేవు ?

అబ్బాయి

ఏమండీ ?

శాస్త్రుల్లుగారు

వ్యాసం వ్రాయమంటే గ్రామ్యం తగలేస్తారురా ?

అబ్బాయి

ఎల్లా రాయాలండి !

శాస్త్రుల్లుగారు

ఏది చూడనియ్యి....చూడూ నీభాష గంభీరంగా ఉండాలి. అంటే తెలుగుమాటలు వెయ్యవలసిన చోట సాధ్యమైనంతమట్టుకు సంస్కృత పదాలే వేస్తూఉండు. ఊరిలో అనేబదులు గ్రామంబున అంటే ఎంతబాగుంది ? పిల్లవాడు అనే బదులు బాలుండు అంటే ఎంతబాగుంటి ? తెలిసిందీ ?

అబ్బాయి

తెలిసిందండి. ఇంకా ఏమేనా తప్పు లున్నా యేమో చెప్పరూ ?

శాస్త్రుల్లుగారు

ఆం. చెప్తా. వింటున్నారు రా అందరూను ? "పువ్వులు గుచ్చడం" అన కూడదు. "పుష్పంబులు గ్రువ్వుట" అన

వలెను. "బళ్లోకి" అన కూడదు "పాఠశాల లోపలకు" అన వలెను. కుషష్ఠికి వెనక ద్రుతముంటుందని మరవ కండి. మనం మాట్లాడే మాటలు మాట్లాడేటట్లు గాకుండా కొంచెం మారుస్తూ ఉంటే అది గ్రాంథికమవుతుంది. "ఊరు కొనదు" అనే బదులు "ఊర కొనదు" అనీ, "వానలో తడిసి" అనే బదులు "వానలో తడసి" అనీ, "కలిసి పోయెను" అనే బదులు "కలసి పోయెను" అనీ ఇత్యాదిగా. సరే వెళ్లు, మళ్లీ రాసి చూపించు.

అబ్బాయి

అలాగేనండి.

శాస్త్రుల్లుగారు

ఇంకో కుర్రాడు—ఒరే వెంకన్నా—నీ వ్యాసం చూపించు.

వెంకన్న

ఇదిగోనండి.

శాస్త్రుల్లుగారు

సరే.........ఇదేమిట్రా? ఇది చదువు.

వెంకన్న

"శబ్దశ్రేణి కితండు దుర్మార్గుండనియే యూహించుదము"

శాస్త్రుల్లుగారు

అంటే, ఏమిటి ?

వెంకన్న

"మాటవరస కితడు దుర్మార్గుడనుకుందాము"

శాస్త్రుల్లుగారు

ఊహూఁ; ఊహూఁ; సరే, కాని, చూద్దాము .... ఏదీ తరవాత?....ఇదేవిట్రా.........ఇది చదువు.

వెంకన్న

"మీరునకును రాజుగారునకును ఏమైన పరిచయంబున్నచో వచింపుడు"

శాస్త్రుల్లుగారు

"మీరునకును" ఏమిట్రా?

వెంకన్న

మీకును అన్న మాటండి.

శాస్త్రుల్లుగారు

ఛీ, తప్పు, మీకును అనే రాయి. సరే, "రాజుగారునకును" అన్నావేమిటి?

వెంకన్న

"రాజుగారికి" అనమన్నారా?

శాస్త్రుల్లుగారు

ఊఁ, ఊఁ, రాజుగారునకు.... పోనీలే. సరే వెళ్లు. తప్పులు దిద్దుకు మళ్లీరాయి.

వెంకన్న

చిత్తం.

అవధానులగారబ్బాయి

నేను మళ్లీరాసుకువచ్చాను. చదవనాలండి?

శాస్త్రుల్లుగారు

చదువు.

అబ్బాయి

ఒక గ్రామంబున నొక బాలుండుండెను. అతనికి బాల్యంబుననే తల్లీ జనకుండును........

శాస్త్రుల్లుగారు

జననీ జనకులు అనిరాయి.

అబ్బాయి

జననీ జనకులు కాలం బొనరించిరి.

శాస్త్రుల్లుగారు

"కాలం బొనరించిరి" అంటే ?

అబ్బాయి

చచ్చిపోయే రండి.

శాస్త్రుల్లుగారు

ఓహో, కాలం చేశారా? సరి సరి.

అబ్బాయి

మేనమామ గృహంబు నొద్ద చదువు కొంటూ ఉండు వాడు.

శాస్త్రుల్లుగారు

చదువుచు, లేదా పఠించుచు అని రాయి. తరువాత చదువు.

అబ్బాయి

"చరించు పాదంబును దూషించు వక్త్ర గహ్వారంబును గ్రామంబు కొన దన్నట్లుగా నీతండు ...."

శాస్త్రుల్లుగారు

ఆ, ఆ, ఆగు, ఆగు, గ్రామంబు కొనదేమిటి ?

అబ్బాయి

ఊరుకొనదు అన్నమాటండి. తిరిగేకాలూ తిట్టేనోరూ ఊరుకోదు. వ్యాసాల్లో సామెతలు రాయమన్నారు కాదండీ!

శాస్త్రుల్లుగారు

సరే, సరే,....గ్రామంబు కొనదు అనిరాయకు. ఊర కొనదు అనిరాయి.... లేకపోతే.... లేకపోతే....మూకీభావము వహింపదు అని రాస్తే?

అబ్బాయి

అల్లాగే రాస్తానండి. తరవాత వినండి........ "నీతండు పాఠశాలనకుం బోవుట మాని వనంబుల వెంబడి చరించీ వాడు"

శాస్త్రుల్లుగారు

చరించువాడు అని దిద్దుకో.

అబ్బాయి

ప్రొద్దారోహించుట తోడనే గృహంబునకు....

శాస్త్రుల్లుగారు

అంటే

అబ్బాయి

పొద్దెక్కడం తోనే....

శాస్త్రుల్లుగారు

ఆఁహాఁ. సరి, సరి....

అబ్బాయి

ప్రొద్దారోహించుట తోడనే గృహంబునకు వవ్వి, కూడా తెవ్విన పువ్వు లన్నియు గ్రువ్వవాడు.

శాస్త్రుల్లుగారు

అదేమిటిరా అర్థం కావడం లేదూ.

అబ్బాయి

"గుచ్చు" బదులు "గ్రువ్వు" రాయ మన్నారు కాదండీ.

శాస్త్రుల్లుగారు

అంటే ?

అబ్బాయి

వచ్చి, తెచ్చి అన డానికి వవ్వి, తెవ్వి అన్నాను.

శాస్త్రుల్లుగారు

ఛా, అలా అనకూడదు—తప్పులు దిద్దుకో.

[గంట కొట్టారు. పిల్లలంతా షైమయిందని గోలచేతురు. శాస్త్రుల్లుగారు ఇంకో క్లాసులోనికి నిష్క్రమణము]

1924